# మంత్రిగారా!... మజాకా!

అఖండ మెజారిటీతో ఆరుసార్లుగా ఎం.ఎల్.ఏ.గా గెలుస్తున్నా మంత్రి పదవి దక్కని దురదృష్టవంతుడు నానాజీ!

నానాజీ కేపిటలిస్టేం కాదు. అట్టడుగు వర్గాల ప్రతినిధి.

హైకమాండ్‌కు దయ కలిగి ఈసారి మంత్రిపదవి దక్కించుకున్న నానాజీ ఆంధ్రరాష్ట్రంలోని దేవాలయాలన్నింటినీ సందర్శించి దేవుళ్ళను దర్శించి తన మొక్కుబడులు తీర్చుకున్నాక మనసు తేలికపడటంతో హమ్మయ్య అనుకుని సేదతీర్చుకున్నాడు. గుండెలమీద బరువు దించుకున్నట్టు ఫీలయినాడు.

కేబినేట్ హోదా మంత్రిపదవి దక్కినందుకు ఓ తెగ సంబరపడుతున్నాడు. చుట్టూ మందీ మార్బలం, గన్‌మెన్లు ఎక్కడికి పడితే అక్కడికి పోయేందుకు ఓ.సి.గా వచ్చిన ఏ.సి.కారు, దండలు, నమస్కారాలు. పాత్రికేయులతో ఇంటర్వ్యూలు. దండుకోగల సమర్థత వుండాలేగానీ ఆదాయానికి ఏం ఢోకా వుండదు.

వచ్చిన చిక్కల్లా ఎక్కడంటే కేబినెట్ మినిస్టరై ఏడాది కావస్తున్నా శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు తన్నెవ్వరూ పిలవకపోవడంతో నానాజీకి పిచ్చెక్కినట్టుంది.

సరిగ్గా అదే సమయానికి అంటే తననెవరూ ఆహ్వానించలేదేని మధనపడుతున్న సమయంలో 'పోరంబోకు' పత్రికవారు తనను రిబ్బన్ కటింగ్‌కు ఆహ్వానించినందుకు ఎగిరి గంతేశాడు. మొత్తానికి శాన్నాళ్ళుగా వున్న నానాజీ కోరిక తీరబోతోంది.

★ ★ ★ ★ ★

బ్రీఫ్‌కేసునిండా నోట్ల కట్టలు సద్దుకున్న గవర్రాజు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్లో దిగాడు. ప్రయాణ బడలిక తీర్చుకుని టిఫిన్ కాఫీ సేవించి తన చిరకాల మిత్రుడు గంగరాజుకి ఫోను చేశాడు.

వెంటనే ఆటోలో వచ్చి వాలిన గంగరాజు గవర్రాజుని సమీపించి అమాంతం వాటేసుకుని "ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి" సంబరపడుతూ అన్నాడు.

"అవున్రా! నువ్వు మనూరు రావటంలేదు... నేను ఇక్కడికి రావలసిన పనీ పళ్లేదు. అందుకే ఒకరినొకరం కల్సుకోలేకపోయాం"అన్నాడు గవర్రాజు.

"నీకేంరా? బంగారు పిచ్చుకవి! ఇంత హడావుడిగా వూడిపడ్డావేంటి? నువ్వొస్తున్నట్టు కబురైనా పెట్టలేదు. ఏమిటి విశేషం?"

"విలేజ్ లైఫ్‌మీద బోర్ కొట్టేసిందిరా! దినపత్రికలు చదవటం, టి.వి. ముందు కూర్చోవటం... లేకపోతే పొలంపన్లు చూసుకోవటం తప్ప మరో వ్యాపకం లేకుండా పోయింది" అన్నాడు

విసుగ్గా గవర్రాజు.

"అందుకని జల్సా చేసుకుందామని సిటీకొచ్చావా?" నవ్వాడు గంగరాజు.

"నీ వెటకారాలు ఆపు?"

"అయితే చెప్పు... నీ రాకకు గల కారణంబేమి?" అన్నాడు నాటకం స్టైల్లో..!

"ఓ మాంచి సినిమా తీద్దామని వుందిరా! అందుకే వచ్చాను. నువ్వు స్టోరీ రైటర్‌వి కదా? నీ దగ్గర కథలకు కొదవ వుండదు. ఈ సమాజాన్ని వుద్ధరించేదీ లేదా సంస్కరించేదీ ఓ మంచికథ నీ దగ్గరుంటే చెప్పు! లేకపోతే రాసిపెట్టు ఏం?" అన్నాడు గబగబా తనొచ్చిన పని చెప్పేసినట్టు.

"నీ ప్రపోజల్ వెంటనే డ్రాప్ చేసుకో.. ఎంచేతంటావేమో, ఇప్పుడు ఫిలిమిండస్ట్రీ పీకల్లోతు కష్టాల్లో వుంది. ఉద్ధరణ, సంస్కరణ అంటూ పిక్చర్ తీస్తే నీ చేతికి చిప్పే! ఇప్పుడు దర్శకుల దృష్టంతా సెక్సు, క్రైమ్మీదే ఉంది" అన్నాడు గంగరాజు.

"అయితే ఓ పత్రిక పెట్టేద్దాం! ఏదోటి వ్యాపకం కావాలి నాకు. డబ్బు గురించి దిగుల్లే"దన్నాడు గవర్రాజు.

"ఇది బాగుంది నువ్వు నడపాలనే పత్రిక వీక్లీనా? మంత్లీనా? మహిళల కోసమా? పురుషుల కొరకా?" గబగబా అడిగేశాడు గంగరాజు.

"ఆపావు! అందరూ ఆనందంగా... హాయిగా చదువుకునే విధంగా వుండే మాసపత్రిక నడుపుదాం!"

"ఐడియా బాగానే వుంది! పత్రిక నడపడమంటే నువ్వు ఊహిస్తున్నంత ఈజీ కాదు! దానికో ఎడిటర్ కావాలి... పత్రిక సర్క్యులేషన్ పెంచుకునే విధానాలు తెలియాలి... యాడ్స్ సేకరించాలి... వైవిధ్యభరితంగా అన్నివర్గాల పాఠకులనూ ఆకట్టుకునే విధంగా పత్రిక తేవటమూ అంటే... కందిపచ్చడిలో కొత్తావకాయ కలుపుకుని లగాయించినంత తేలికకాదు. అయినా... నాకు తెలిసిన ఫ్రెండొకాయనున్నాడు. పత్రికలు నడపడంలో అనుభవజ్ఞుడు! అనేక ప్రముఖ పత్రికలు నడపటంలో అనుభవజ్ఞుడు! అనేక ప్రముఖ పత్రికలలో చాలాకాలం పనిచేశాడు. ఆయన ఇప్పుడు ఖాళీగానే వున్నాడు. ఆయన పేరు 'కళేబరం' అదాయనకు అచ్చొచ్చిన కలం పేరులే! అసలు వేరే పేరేదో వుంది. ఆయన్నొకసారి కలుద్దాం"

ఫ్రెండ్ గంగరాజు మాటలకి ఫకాలున నవ్వాడు గవర్రాజు.

"ఇదేం పేర్రా బాబూ! కళేబరం...కంకాళమూనూ ఇలాంటి పేర్లను కలంపేర్లుగా పెట్టుకోవటం విడ్డూరంగా వుంది...' అన్నాడు నవ్వుతూ కళ్ళింత చేసుకుని.

"అది వారి వ్యక్తిగతమైన అభిరుచి! అద్సరే పత్రిక్కేం పేరు పెడదామనుకుంటున్నావ్...!"

"ఇంకా ఏం అనుకోలేదు. ఇప్పుడేగా మనకు పత్రిక పెట్టాలనే ఆలోచనొచ్చింది... సాయంకాలం మనిద్దరం కళేబరంగారిని కలిశాక టైటిల్ విషయం ఒక నిర్ణయానికొద్దాం! సరేనా!"

"ఇంకేం! నువ్వు రూమ్‌లోనే ఉండు. సాయంత్రం ఆఫీసునుంచి నేరుగా ఇటే వస్తాను. ఇద్దరం వెళ్ళి కళేబరం గారిని కల్సొద్దాం! ఏం సరేనా!" అంటూ రూమ్‌లోంచి బైటికొచ్చి నేరుగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు గంగరాజు.

గవర్రాజుది... గంగరాజుది ఒకే ఊరు. ఇద్దరూ కల్సి టెన్త్ దాకా ఒకేచోట చదివారు

గవర్రాజు డిగ్రీ అయ్యాక పొలంపనులు చూసుకుంటున్నాడు. బలిసిన ఆసామి! యాభై ఎకరాల మాగాణీ, మామిడితోటలు, కొబ్బరితోటలు, రైసుమిల్లు, బ్రాందీషాపు వగైరా ఎన్నో వున్నయ్.

గంగరాజు బీదోడు కాబట్టి పొట్టచేత పట్టుకుని సిటీకొచ్చి వాళ్లకాళ్ళు వీళ్ళకాళ్ళు పట్టుకుని సచివాలయంలో ఎలాగో అష్టకష్టాలు పడి ఉద్యోగం సంపాదించి బతికేస్తున్నాడు.

గంగరాజు పత్రికలకు కథలూ గట్రా రాస్తూంటాడు. కాస్తో కూస్తో రైటర్‌గా పేరు సంపాదించుకున్నాడు.

పెళ్ళిచేసుకుని కాపురంపెట్టి అయిదేళ్ళయింది. పిల్లా జల్లాలేరు. ఆ వచ్చే జీతం భార్యాభర్తలిద్దరికీ లక్షణంగా సరిపోతోంది. కథల తాలూకు వచ్చే రెమ్యూనరేషన్ మందు ఖర్చు, సిగరెట్ ఖర్చులకు సరిపోతోంది.

గంగరాజు మంచి మాటకారి! ఎదుటివారిని నిముషాల్లో బోల్తా కొట్టించగల నేర్పరి!

ఇకపోతే... గవర్రాజు మనిషి భోళా! పొగడ్తకు 'ధాం' అని పడిపోతాడు. స్నేహం కోసం డబ్బు ఖర్చు చేయటానికి వెనకాడ్డు. కోట్ల ఆస్తికి అతనొక్కడే యజమాని! విధవరాలైన తల్లి... చక్కని చుక్కలాంటి భార్య... ఇద్దరు పిల్లలు!.

సచివాలయంలో ఉద్యోగమంటే అంత చెమటోడ్చి శ్రమపడాల్సిన పనేమీ ఉండదు. పాన్ నముల్తూ ఛాయ్ తాగుతూ పోచికోలు కబుర్లతో కాలం గడుపగల అవకాశం బోలెడుంటుంది. పదకొండు దాటేక ఆఫీసుకెళ్ళినా... మూడు గంటలకు చెక్కేసినా... ఈ మధ్య సమయంలో సీట్లో అవుపించకపోయినా అజమాయిషీ చేసేవారుండరు. ఆఫీసర్లను కాకాపట్టటంలో... సూపర్‌వైజర్స్‌ని మస్కా కొట్టటంలో... మినిస్టర్లను ఆశ్రయించుకు బతికేయటంలో పొద్దుబుచ్చుతుంటారు.

అలాంటిచోట జాబొచ్చినందుకు గంగరాజు ఎగిరి గంతేశాడు. తెగ సంబరపడ్డాడు. సీట్లో కూర్చుంటే ఆఫీసువారి తెల్లకాగితాలనుపయోగించుకునే కథలు రాసి పారేస్తూంటాడు.

పెందలాడే బైటపడ్డ గంగరాజు ఆటోలో గవర్రాజుంటున్న లాడ్జికొచ్చాడు.

ఇద్దరూ కాఫీ లాగించారు!

"మంచి పోష్ ఏరియాలో ఒక అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుందామోయ్ గంగరాజూ! పత్రికాఫీసుకీ, నేను అందులోనే వుండటానికి వీలుగా వుండేటట్టుంటే బావుంటుంది. ఏమంటావ్!"

"నీ ఆలోచన భేషుగ్గా వుంది. మనకు తెలిసన హౌస్ బ్రోకరొకడున్నాడు. వాడి చెవిన వేస్తేచాలు.. అర్ధగంటలో మనలను వెంట బెట్టుకెళ్ళి ఇల్లు చూపిస్తాడు"

"అబ్బ! ఇల్లనకరా... ఇల్లంటే ఛీప్‌గా వున్నట్టుంటుంది. రెంటు నెలకి పదివేలైనా దిగుల్లేదు. అపార్ట్‌మెంట్ కాకపోతే ఇండిపెండెంట్ బంగళా అయినా సరే! అన్ని విధాలా బావుంటే ఓ.కే. చేసేద్దాం! ఏమంటావ్!"

"నేనేమంటానే. నువ్వు ఓ.కే. అంటే నేను యస్సనేస్తాను నేస్తం..." నవ్వాడు గంగరాజు.

లాడ్జిలోంచి బైటకొచ్చి ఆటో ఎక్కేరు 'కళేబరం' గారిని కలవాలని!

★ ★ ★ ★ ★

గంగరాజు పనిచేస్తోంది సెక్రటేరియట్లో కాబట్టి... ప్రారంభించనున్న వారపత్రిక 'పోరంబోకు' మంత్రిగారిచే రిబ్బన్ కటింగ్ చేయిస్తే బావుంటుందనుకున్న గవర్రాజు ఆలోచన కార్యరూపం దాల్చటం తేలికైంది.

"ఒరే గవర్రాజూ... మంత్రి నానాజీగారిని వారి బంగళానుండి ఏనుగంబారీమీద మన ఆఫీసుకు తీసుకు రావాలట! అంటే... మనమో ఏనుగును హైర్‌కి తీసుకోవాల్సి వుంటుంది. ఇకపోతే రిబ్బన్ కటింగ్‌కోసం బంగారంతో చేయించిన కత్తెరిస్తే తప్ప ప్రారంభోత్సవం నాడు రిబ్బన్ కట్ చేయనన్నాడు నానాజీ మంత్రివర్యులు! బంగారంతో సిజర్స్ చేయించాలంటే ఎంతలేదన్నా పదితులాల బంగారం వుండి తీరాలి! మజూరీ, బంగారం అంతా కల్సి లక్ష దాటుతుందేమోనని భయంగా వుందిరా... పైగా ఆ కత్తెర తిరిగివ్వరట! అదాయన సొంతం చేసుకుని తీసుకెళతానంటు రవ్వంత మొహమాటమైనా లేకుండా చెప్పేసాడాయన..." అన్నాడు మొహమింత చేసుకుని గంగరాజు.

"నువ్వేం దిగులు పడద్దు! ఆయనగారి గొంతెమ్మ కోరికలన్నీ తీరుద్దాం! నేనుండగా నీకేం భయంలేదు. ఏనుగేం ఖర్మ సింహంమీద స్వారి చేస్తూ వస్తానన్నా ఏర్పాటు చేయటానికి వెనకాడను... ఏమంటావ్?" అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ గవర్రాజు.

ఆటోలో వెడుతూ అనేక విషయాలు డిస్కస్ చేసుకుంటూ నేరుగా 'కళేబరం' ఇంటిముందు ఆగిన ఆటోలోనుండి ఇద్దరూ దిగి కాలింగ్‌బెల్ కొట్టారు.

తలుపు తెరుచుకుంది?

"కళేబరం గారి కోసం వచ్చాం..." ఇద్దరూ ముక్తకంఠంతో అన్నారు.

"రండి లోపలకు... మీకోసమే ఎదురుచూస్తున్నాను... నేనే కళేబరాన్ని..." అనటంతో ముగ్గురూ లోనికి వెళ్ళి సోఫాల్లో కూర్చున్నారు.

అన్ని విషయాలు కూలంకషంగా మాట్లాడుకుని ఒక నిర్ణయానికి రావటానికి రెండుగంటలసేపు పట్టింది.

★ ★ ★ ★ ★

కళేబరం ఆధ్వర్యంలో 'పోరంబోకు' పత్రికావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.

పోరంబోకు మాసపత్రికకు సంబంధించిన పబ్లిసిటీ 'యాడ్స్' అన్ని తెలుగు టి.వీ.ల్లో ప్రసారమైనాయ్.

పత్రిక ప్రారంభ సంచిక నుండే పాఠకులలో ఓవిధమైన 'క్రేజ్' క్రియేటయ్యింది... ప్రతి సంచిక సర్వాంగ సుందరంగ ముస్తాబై ఓ విలక్షణ పత్రికగా పాఠకదేవుళ్ళను అలరిస్తోంది.

ఏడాదికాలం తిరిగేసరికి స్వంత ప్రెస్ పెట్టుకోగల స్తోమత పత్రికకు ఏర్పడింది! నాలుగేళ్ళు పూర్తిచేసుకునేసరికి అత్యధిక సర్క్యులేషన్ గల మాసపత్రికగా పత్రికా లోకంలో అగ్రభాగాన నిలిచి కీర్తిప్రతిష్టలను అర్జించింది.

బహుస్వల్ప కాలంలో ఒక పత్రికస్థాయి మహోన్నత స్థితికి చేరుకోవటం అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచేసింది.

పత్రిక వ్యవస్థాపక ఓనర్ గవర్రాజు పత్రిక సర్క్యులేషన్ చూచి బిత్తరపోయాడు! కళేబరాన్ని ఎడిటర్ స్థానంలో కూర్చోబెట్టినందుకు తమ అంచనా తలకిందులు అవకుండా ఆయన టేలెంట్ ప్రూవ్ చేసుకున్నందుకు గవర్రాజు సంతోషించాడు.

మిత్రుడు గంగరాజు చేసిన సహాయానికి పర్ధ శ్రమకు ప్రతిఫలంగా వరుసగా ప్రతి సంచికలోనూ అతని కథ అచ్చువేసి ఈ రూపంలో అతని ఋణం తీర్చుకోగలిగేడు గవర్రాజు.

పత్రిక నాలుగేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా నవలల పోటీ నిర్వహించదలిచి ఆ మేరకు అన్ని పత్రికల్లోనూ టి.వీ.లలోనూ భారీఎత్తున 'యాడ్స్'లు ఇచ్చారు.

ప్రథమ బహుమతి అయిదు లక్షలు... ద్వితీయ బహుమతి మూడులక్షలు, తృతీయ బహుమతి లక్షరూపాయలుగాను... రెండు కన్సొలేషన్ బహుమతులు ఒక్కోదానికి యాభైవేలుగానూ ప్రకటనలు వెలువడ్డం చూచిన రచయిత(త్రు)లు నివ్వెరపోయారు.

వెయ్యి నవలలకు పైగా పోటీకి రాగా... అనేక వడపోతల తర్వాత అత్యంత ఉత్కృష్టమైన వాటిని బహుమతులకు ఎంపిక చేయటం జరిగింది.

పదిలక్షల సర్క్యులేషన్ చేసుకున్న 'పోరంబోకు' ఫ్యామిలీ మాసపత్రిక అందులో సగం అయిదు లక్షల బహుమతి ఎవరికొస్తుందా అని రచయిత (త్రు)లంతా అత్యంత ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

★★★★★

బహుమతులు ప్రకటించిన మరునాడే పత్రికాఫీసుకు మినిస్టర్ నానాజీరావునుంచీ ఫోనొచ్చింది.

"ఎవరది?... గవర్రాజా మాట్లాడుతోంది? నువ్వు ద్రోహం చేసావ్. నన్నవమానించావ్. నీ పత్రిక మూసేయించగల సత్తా నాకుంది. నీ పత్రికాఫీసుపై ఐ.టి. దాడులు జరిపించగలను. ఖబడ్దార్! నానాజీ పవరేంటో చూపిస్తా. ఏమనుకుంటున్నావో?" అంటూ అగ్నిపర్వతం

బద్ధలైనట్టు మాట్లాడాడు.

విషయం బోధపడక గవర్రాజు బెంబేలెత్తాడు.

"అసలేం జరిగింది సార్... ఎందుకిలా ఫైరవుతున్నారు? మీరు మా పత్రిక ప్రారంభోత్సకులు!... మీ చేతి చలువ వల్లనే ఈనాటికి పత్రిక ఊహించని స్థాయికి ఎదిగింది" అన్నాడు నెమ్మదిగా గవర్రాజు.

"షటప్! నువ్వు నా మనిషివనుకున్నాను. నీగురించి గంగరాజు చెప్తే గుడ్డిగా నమ్మాను... నువ్వు దగా చేశావ్..." అంటూ ఫోన్‌లోనే చిందులేస్తున్నాడు నానాజీ.

"అసలు విషయమేంటో సెలవీయండి మంత్రిగారూ..." అంటూ సాగదీసాడు గవర్రాజు.

"నీ పత్రిక నిర్వహించిన నవలల పోటీకి నా పెద్దకోడలు కూడా ఓ మంచి నవల పంపింది! ఆ నవలను ఆర్డినరీగ కూడా సెలక్ట్ చేయలేదు. మొదటి బహుమతి తప్పక వస్తుందని నా కోడలు ఎంతో ఆశతో ఎదురుచూచింది. చివరకామెకూ, నాకూ కూడా నిరుత్సాహమే ఎదురైంది" అన్నాడు నిట్టూరుస్తూ సదరు మంత్రి.

"అయ్యయ్యో... సారీ సార్! మీ కోడలుగారు నవల పంపేరన్న సంగతి నాకు తెలీదు. ముందుగా నాతో మాటమాత్రమైనా అన్లేదు మీరు..."

"నోర్ముయ్! పత్రిక నడిపేవాడివి. ఏ రైటర్ ఎవరి తాలూకో తెలుసుకోవలసిన అవసరంలేదా నీకు? అంత పెరిగిపోయిందా నీ లెవెలు? ఇప్పటికైనా మించింది లేదు. ప్రథమ బహుమతి విషయంలో పొరపాటు జరిగినందుకు చింతిస్తున్నానంటూ ఓ ప్రకటనివ్వు. ఆ నవలకు బదులు నా కోడలు పంపిన నవలకు బహుమతిస్తున్నట్టు ప్రకటించు! ఈ ఛీప్ ట్రిక్స్ నేన్నీకు నేర్పాలా? లౌక్యం తెల్సుకో గవర్రాజూ... సవరణ ప్రకటన అన్ని పత్రికల్లో... టీ.వీ.ల్లో ఇవ్వు! అర్థమైందా?-" అన్నాడు మంత్రి.

"ఇదన్యాయం సార్.." మొత్తుకున్నాడు గవర్రాజు.

"అయితే రేపీపాటికి మీ పత్రికాఫీసుపై ఐ.టి.దాడులు జరిపిస్తాను. నీ కార్యాలయానికి తాళం వేయిస్తాను... ఏమనుకున్నావో?... జాగ్రత్త" అంటూ గర్జించాడు నానాజీ.

మంత్రిగారు ఫోన్ పెట్టేయగానే పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు గవర్రాజు...!

- సమాప్తం -

*(ఆంధ్రప్రభ డైలీ, 2,3-5-2009)*